క్లుప్తంగా

ప్రజలతో మమేకం కావాలి



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథ రాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నేతలు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం వైఎస్సార్ సీపీ సేవాదళ్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలతో మమేకమై ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించే విధంగా కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. నూతనంగా నియామకం పొందిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల కన్వీనర్లు దిద్దే శ్రీనివాస్ (పోడూరు), సాయి మురళీ రెడ్డి (పెనుమంత్ర), బాలం సత్తిరాజు (పెనుగొండ), సుగుణ రాజు (ఆచంట) సోమవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండల కన్వీనర్లను పలువురు అభినందించారు.

వాసవీమాత ఆలయంలో కుంకుమ పూజలు



మొగల్తూరులో వాసవీమాత గ్రామోత్సవం

మొగల్తూరు: వాసవీమాత ఆత్మ ఆర్పణం దినోత్సవం సందర్భంగా సోమవారం మొగల్తూరు గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు, యువతీ, యువకులు, పెద్దలు అమ్మవారిని పల్లకిలో గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా శేషాద్రి బాధ్యతల స్వీకరణ

పాలకొల్లు సెంట్రల్: పట్టణ మునిసిపల్ కమిషనర్‌గా బుద్ద రామ సత్య శేషాద్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సామర్లకోట మునిసిపాలిటీ నుంచి ఆయన ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఆయన స్వస్థలం అనకాపల్లి. ఇప్పటి వరకూ 16 మునిసిపాలిటీల్లో విధులు నిర్వర్తించినట్టు ఆయన తెలిపారు. జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరి అంచెలంచెలుగా పదోన్నతులతో ఈ స్థాయికి వచ్చినట్టు ఆయన అన్నారు. కమిషర్‌గా పలాస, పెద్దాపురం, డీఎంఏ కార్యాలయంలో ఎలక్షన్ వింగ్‌లో పని చేసి సామర్లకోట కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు. అక్కడి నుంచి పాలకొల్లు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ కమిషనర్‌గా వ్యవహరించిన ప్రమోద్‌కుమార్ డీఎంఏ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు. మునిసిపల్ సిబ్బంది నూతన కమిషనర్ శేషాద్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మేడపాడు వీఆర్వోగా శ్రీనివాసరావు

యలమంచిలి: మేడపాడు వీఆర్వోగా తోట శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పోడూరు మండలం వేడంగి వీఆర్వోగా పనిచేస్తూ డిప్యూటేషన్‌గా మేడపాడు వచ్చారు. మేడపాడు వీఆర్వో పి సూర్యనారాయణ ఆరు నెలల క్రితమే బదలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆర్యపేట, కొంతేరు వీఆర్వోలు విప్పర్తి సురేష్, గెడ్డం సత్యనారాయణలు ఇన్‌చార్జ్ వీఆర్వోలుగా పని చేస్తున్నారు. తహసీల్దార్ లక్కు నరసింహారావుకు డిప్యుటేషన్ ఉత్తర్వులు అందజేసిన అనంతరం శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నరసాపురం రూరల్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డీఎస్పీ రవి మనోహరాచారి అన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం డ్రగ్స్ కంట్రోల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్ల వద్దని సూచించారు. యువత బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. సీఎం వి సురేష్ బాబు, మొగల్తూరు ఎస్సై ఎం వీరబాబు, కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రెజరర్ కేవీ స్వామి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థి మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంఎంకేఎస్‌ఎం మునిసిపల్ హైస్కూల్లో 84 మంది 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బందికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అడ్డాల నాని, క్లబ్ సెక్రటరీ ఫీర్ సాహెబ్, క్లబ్ కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యాయులు పితాని ధర్మారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికీ పథకాలు



పెనుగొండలో గడపగడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పాలకొల్లు మండలం వరిధనంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్

పెనుగొండ: రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను అందించి ఎంతో మేలు చేసారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆచంట నియోజకవర్గం పెనుగొండ చిన్నంవారిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొని లబ్ధిదారులకు అందించిన సంక్షేమాన్ని వివరించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనతను సీఎం జగన్ దక్కించుకున్నారన్నారు. పథకాలు సక్రమంగా అమలు చేయడంతో ధైర్యంగా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలు గత పాలనకు, సీఎం జగన్ పాలనకు తేడా గమనించాలన్నారు. గతంలో ఏ ఒక్క పథకం లబ్ధి కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యులకు చేతులు తడపాల్సి వచ్చేందన్నారు. నేడు ఏ ఒక్కరికీ పైసా ఇవ్వకుండానే అర్హతే ప్రామాణికంగా పథకాలు అన్ని వర్గాల వారికి ఇంటి ముందుకు వచ్చి చేరుతున్నాయన్నారు. పథకాల లబ్ధి అందుకుంటూ విమర్శలు చేస్తున్న ప్రతి పక్ష నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. చిన్నం వారి పాలెంలో దశాబ్దాలుగా రహదారి సమస్యతో సతమతం అవుతుంటే ప్రధాన రహదారి నిర్మించామన్నారు. నాడు- నేడులో పాఠశాల నిర్మాణం చేపట్టామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ (మీస్సీ), ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, ఎంపీటీసీ మద్దింశెట్టి లక్ష్మి, మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాప రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనరు బళ్ల బద్రి, నాయకులు గాజుల బులి పుల్లారావు, ఆకెశెట్టి చంటి, తిక్కిరెడ్డి పవన్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి చంద్రమౌళీశ్వరరెడ్డి, చిన్నం రామిరెడ్డి, చెవ్వేటి రాజు, నేలపూడి లక్ష్మణరావు, మేడపాటి చిరంజీవి రెడ్డి,మేడపాటి వీర్రెడ్డి, సుంకర నాగబాబు, నాగిశెట్టి నరసింహారావు, మద్దు శ్రీనివాసరావు, కేశవరపు గణపతి, బండారు ప్రసాద్, పూర్తిళ్ల శ్రీను, కుడిపూడి సుబ్రహ్మణ్యం, మురళీ, పిల్లి నాగన్న పాల్గొన్నారు.

సీఎం జగనన్నను ఆశీర్వదించండి

పాలకొల్లు అర్బన్: ప్రజలందరికీ పథకాలు అందిస్తున్న సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు మండలం వరిధనంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీనివాస్ పర్యటించి ప్రజలకు నవరత్నాల పథకాల ప్రయోజనాలను వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కాని అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి ప్రతి ఒక్క కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం కల్పిస్తున్న వైఎస్సార్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. పాఠశాలల రూపురేఖలను మార్చి ప్రతి విద్యార్థి చదువుకోవడానికి అనేక ప్రయోజనాలను కల్పించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు మహిళలు మంచినీరు, డ్రెయినేజీ సమస్యలను శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ వరిధనంలో పాలకొల్లు మునిసిపాలిటీలో విలీనం చేయడం వల్ల కొంత ఆలస్యమైందని, త్వరలోనే ప్రజలందరికీ స్వచ్ఛమైన మంచినీరు అందిస్తామని హామీ ఇచ్చారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

రూ.22లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఈ సందర్భంగా రూ.12 లక్షలతో గ్రామ దేవత నేరేళ్లమ్మ అమ్మవారి గుడి వీధి, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మంచినీటి చెరువు వద్ద రూ.10లక్షలతో ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులకు శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో చింతలపూడి వైసీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, జగనన్న సచివాలయ కన్వీనర్లు పార్కి వెంకటరత్నం, బొద్దు సుబ్బారావు, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్ధనపు మోహన్‌రావు, గ్రామ పార్టీ నాయకులు కవురు శ్రీనివాస్, చీర్ల ధర్మరాజు, పెచ్చెట్టి ఏడుకొండలు, ఆకుల పెద్దిరాజు, బుడితి దైవరాజు, దొమ్మేటి రత్నంరాజు, బుడితి శ్రీను, మాదిరెడ్డి నాగు, కుక్కల గంగాధర్, కవురు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉల్లంపర్రులో 'గడపగడపకు'

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రులో మంగళవారం ఉదయం 7గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, జగనన్న సచివాలయాల పట్టణ ఇన్‌చార్జ్ ఎంఎస్ వాసు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు పెనుగొండలో..

పెనుగొండ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం మంగళవారం పెనుగొండలో నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాప రెడ్డి(బాబి)తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు చిన్నంవారి పాలెంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

చెస్ పోటీల్లో ఛాంబర్స్ విద్యార్థినుల ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: పట్టణ స్థాయి చెస్ పోటీల్లో ఛాంబర్స్ కళాశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన చెస్ పోటీల్లో ఛాంబర్స్ విద్యార్థినులు ఎం గాయత్రి, కే విష్ణుశ్రీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలను కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహరావు, సెక్రటరీ కె. రామరాజు, పిడి బండారు అప్పారావు అభినందించారు.

స్పందనలో మూడు అర్జీలు

యలమంచిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. చించినాడ గ్రామానికి చెందిన పొత్తూరి వెంకట సత్యనారాయణరాజు తన స్వాధీనంలో ఉన్న భూమికి ఆర్‌ఎస్‌ఆర్ కాపీ కావాలని, యలమంచిలిలంకకి చెందిన కొల్లు పేతురు ఉమ్మడి ఆస్తి వివాదం పరిష్కరించమని, యలమంచిలికి చెందిన వణుకూరి ప్రియాంక తన భర్త మూడేళ్ల క్రితం వదిలేశారని, 2021లో పోలీసు కేసు పెట్టినా సమస్య పరిష్కారం కాలేదని, తనకు న్యాయం చేయాలని అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్కు నరసింహారావు, ఎంపీడీఓ చివటం త్రిశూల పాణి ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

పెరుగులంక భూమిలో మట్టి తవ్వకాన్ని అడ్డుకోవద్దు



చించినాడలో పెరుగులంక భూమిని పరిశీలిస్తున్న నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ

యలమంచిలి: ఏనుగువానిలంకలో వశిష్ట గోదావరి తీరం వెంబడి పడమర వైపున పెరుగులంక భూమి ఉంది. ఆ పెరుగులంక భూమిలో మట్టిని తవ్వి కొంతేరులోని జగనన్న లేఅవుట్ భూమిని పూడ్చమని కలెక్టర్ గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. వారం రోజుల క్రితం గృహనిర్మాణ శాఖ అధికారులు మట్టిని తీయడానికి వెళ్లారు. స్థానికులు మట్టి తవ్వకాన్ని అడ్డుకున్నారు. పూర్వం మాకిచ్చిన బి ఫారం పట్టా భూములకు ఎదురుగా పెరుగులంక భూమి ఉందని, ఆ భూమిని కూడా ఇవ్వాలని, మట్టి అవసరమైతే తూర్పు వైపు ఉన్న పెరుగులంక భూమిలో తీసుకోవాలని వారు చెప్పారు. దీంతో ఆయాభూములను పరిశీలించేందుకు సోమవారం సబ్ కలెక్టర్ సూర్యతేజ ఏనుగువానిలంక వచ్చారు. లంక భూమిని పరిశీలించి ప్రభుత్వ భూమి కనుక ఎక్కడ అవసరమైతే అక్కడ మట్టి తీసుకుంటామని చెప్పారు. తూర్పు వైపున కూడా మట్టి తీస్తామని అడ్డుకోవడానికి లేదని వారికి నచ్చచెప్పారు. శ్మశాన వాటిక కోసం కేటాయించిన భూమి ఆక్రమణలో ఉందని, దానిని తిరిగి ఇప్పించాలని స్థానికులు కోరగా సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యపై విచారణ చేసి అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెరుగులంక భూమిలో గృహనిర్మాణ శాఖ అధికారులు మట్టి తీస్తారని అడ్డుకోవద్దని తెల్పి చెప్పారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ నాగార్జున, తహసీల్దార్ లక్కు నరసింహారావు, హౌసింగ్ డీఈ రామాయణం త్రిమూర్తులు, ఎలక్ట్రికల్ ఏఈ డి రాజీవ్, వీఆర్వోలు కాకితాపల్లి శ్రీనివాసరావు, పద్మశ్రీ ఉన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం



మొగల్తూరులో ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు: ఆలయంలో భక్తులకు, గ్రామస్తులకు అందుబాటులో ఉండే విధంగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గ్రామానికి చెందిన అనంతపల్లి బాబాలు, వారి కుమారులు ఫణి, గోపాలకృష్ణ స్థానిక రామాలయం, రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాల స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 3వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంటును సోమవారం ఆయన ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు, గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించేందుకు ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని దాతలు కోరారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ సౌమ్య

పాలకొల్లు సెంట్రల్: బాల్యవివాహాలు చేసుకుంటే వరుడు,వధువు వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో యాక్ట్ ద్వారా శిక్షలు పడే అవకాశం ఉందని సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ సౌమ్య తెలిపారు. సోమవారం స్థానిక 17వ వార్డు శివారు ప్రాంతం చిత్రావిచెరువు గట్టున బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే ఇరువురి తల్లిదండ్రులకు రెండేళ్లు జైలు శిక్ష పడుతుందన్నారు. వరుడికి సుమారు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా పడుతుందన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ప్రసవ సమయంలో బాలికలు అనేక అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు లావణ్య, జ్యోతి, అంగన్‌వాడీ ధనలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



ముత్యాలపల్లిలో బోస్ విగ్రహానికి పూలమాల వేసిన దృశ్యం



నేతాజీ జయంత్యుత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



పెనుగొండలో కేక్ కట్‌చేస్తున్న నేతాజీ అభిమానులు

మొగల్తూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో బోస్ విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బాల నాగమణి మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను తరిమి కొట్టవచ్చుని నమ్మి ఆచరణలో పెట్టిన నాయకుడు బోస్ అన్నారు. ఈకార్యక్రమంలో కృష్ణంరాజు, కవురు నాగరాజు, తిరుమాని శ్రీనుబాబు, బర్రె రాజకుమార్ వర్మ, పట్టా పరేమేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాలలో బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో నేతాజీ సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు త్రిమూర్తులు, చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళులు

పెనుగొండ: ప్రతి పౌరుడు దేశం కోసం చావడానికి సాహసం చేయకపోతే దేశంలో బతికే హక్కు ఎవరికీ లేదన్న మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. సోమవారం కొడమంచిలి ఉన్నత పాఠశాలలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు దొమ్మేటి రాంబాబు, స్కూలు మాజీ చైర్మన్ పాలుమూరి శేఖర్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో నేతాజీ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. పప్పొప్పుల సూర్యనారాయణ, పొశర్ల సత్యనారాయణ, పడాల జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెనుమంట్ర సహకార సంఘంలో సమీక్ష



పెనుమంట్ర సహకారం సంఘు కార్యాలయంలో సేల్ ఆఫీసర్స్‌తో సమీక్షిస్తున్న జిల్లా కేంద్రబ్యాంకు సీఈఓ శ్రీదేవి

పెనుమంట్ర: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈఓ శ్రీదేవి పెనుమంట్ర సహకార సంఘు కార్యాలయంలో అధికారులు, సేల్ ఆఫీసర్లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం పూర్తి వివరాలను వెల్లడించేందుకు ఆమె నిరాకరించారు. ఈ సహకార సంఘంలో 8 ఏళ్ల క్రితం సుమారు రూ. 40 కోట్ల మేర నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు రావడంతో దీనిపై అధికారులు విచారణ నిర్వహించారు. నిధులు దుర్వినియోగమైనట్టు అధికారులు ధ్రువీకరించి, అందుకు బాధ్యులైన అధికారులను అప్పుడే సస్పెండ్ చేసారు. ఇప్పటి వరకు రూ. 20 కోట్ల వరకు రికవరీ చేసినప్పటికీ, ఇంకా రూ. 21.21 కోట్లు మొండి బకాయిలు వసూలు కావాల్సి ఉంది. దీనికి సంబంధించిన బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులకు సీఈఓ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గతేడాది 70 మంది రైతులకు రూ. 3.50 కోట్లు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందజేసి, సొసైటీని ముందుకు నడిపిస్తున్నామని తణుకు సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ అధికారి, సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్ పి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా ఆలయ గుమ్మం ప్రతిష్ట

పాలకొల్లు అర్బన్: వరిధనంలో గ్రామ దేవత నేరుళ్లమ్మవారి గుమ్మం ప్రతిష్ట సోమవారం నిర్వహించారు. గ్రామ ప్రజల విరాళం సుమారు రూ.50లక్షల విరాళంతో నిర్మిస్తున్న ఈ ఆలయ గుమ్మం ప్రతిష్ట కార్యక్రమాన్ని మల్లిపూడి కనక దుర్గా ప్రసాద్, శ్రీదేవి దంపతులు నిర్వహించారు. శిల్పి ఇంటి ప్రసాద్, గ్రామ పెద్దలు మల్లిపూడి సాంబశివరావు, ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వాసవీ మాతకు సారె సమర్పణ

నరసాపురం రూరల్: వాసవీమాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నరసాపురంలోని ఆర్యవైశ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. వైఎన్ కళాశాల రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పట్టణంలో సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆర్యవైశ్య రామాలయంలోని వాసవీ అమ్మవారికి సారెను సమర్పించారు.

వరిచేలో నాట్లు వేసిన బ్యాంకు మేనేజర్



పోడూరు మండలం గుమ్మలూరు శివారు రావిగొప్పలో వరిచేలో నాట్లు వేస్తున్న బ్యాంక్ మేనేజర్ విజయ్‌సింహా

ఆయనో బ్యాంక్ మేనేజర్.. విధి నిర్వహణలో భాగంగా రుణాల రికవరీ కోసం ఫీల్డ్‌కి బయలుదేరారు.. దారిలో కూలీలు నాట్లు వేయడం చూసి హఠాత్తుగా చేలో దిగిపోయారు. వరిదుబ్బులు చేతబట్టి కూలీలతో పాటు చాలాసేపు నాట్లు వేశారు. దీంతో అక్కడున్న కూలీలు, రైతులు అవాక్కయ్యారు. పోడూరు మండలం గుమ్మలూరు శివారు రావిగొప్పు వద్ద సోమవారం ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఆయన గుమ్మలూరు ఎస్‌బీఐ మేనేజర్ విజయ్‌సింహా. రెండేళ్లుగా ఇదే బ్యాంకులు విధులు నిర్వహిస్తున్న ఆయన గతంలోనూ వరి చేనులో కూలీలు నాట్లు వేయడం చూసి ఎంతో ముచ్చటపడి.. తానూ నాట్లు వేస్తానని తోటి సిబ్బందితో చెప్పినా.. వారు బురద, మట్టి అంటుతుందని వారించారు. దీంతో అప్పట్లో ఆయన కోరిక నెరవేరలేదు. ఈసారి మాత్రం తన తోటి సిబ్బందితో చెప్పకుండానే నేరుగా వరిచేనులో దిగి కూలీలతో పాటు నాట్లు వేశారు. దీంతో తోటి సిబ్బంది కూడా ఆయనతో పాటు చేనులో దిగారు. పుడమితల్లికి పచ్చబొట్లు పెడుతున్నట్టుగా.. ప్రకృతి అందాలకు మెరుగులు దిద్దుతున్నట్టుగా వరిచేలో నాట్లు వేయాలన్న తన కోరిక నెరవేరడంతో బ్రాంచి మేనేజర్ విజయ్‌సింహా ఎంతో సంబరపడ్డారు. – పోడూరు